క్లుప్తంగా

బ్యాడ్మింటన్ క్రీడలకు ఎంపిక



మండల జట్టుకు ఎంపికైన క్రీడాకారులు

కడప స్పోర్ట్స్: కడప నగరంలోని డీఎస్ఏ క్రీడా మైదానంలో మంగళవారం కబడ్డీ, బ్యాడ్మింటన్ క్రీడాంశాల్లో అండర్–14, అండర్–17 బాల, బాలికల ఎంపికలు నిర్వహించారు. ఎస్జీఎఫ్ కడప మండల సమన్వయకర్త ఎస్.సాజిత్ మాట్లాడుతూ కడప మండల స్థాయిలో ప్రతిభ కనబరిచిన క్రీడాకారులు నియోజకవర్గ, జిల్లా స్థాయి పోటీల్లో పాల్గొనాల్సి ఉంటుందని తెలిపారు.

ఏపీఎస్పీడీసీఎల్ ఈఈగా హరి సేవ్యానాయక్

కడప కార్పొరేషన్: ఆంధ్ర ప్రదేశ్ పవర్ డిస్ట్రిబ్యూషన్ కంపెనీ లిమిటెడ్ కడప డివిజన్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్‌గా ఎన్. హరిసేవ్యానాయక్‌ను నియమిస్తూ ఆ సంస్థ చైర్మెన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ కె.సంతోష రావు ఉత్తర్వులు జారీ చేశారు. ఇక్కడ కడప డివిజన్ ఈఈగా పనిచేసిన నరసింహప్రసాద్ ఈ నెల 5వతేదీన పదవీ విరమణ చెందడంతో హరిసేవ్యా నాయక్‌ను ఇన్‌ఛార్జిగా నియమించారు. తాజాగా ఆయనను రెగ్యులర్ ఈఈగా నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

దోష నివారణ పూజలు



రాహుకాల పూజలు నిర్వహిస్తున్న భక్తులు



విజయదుర్గాదేవి

కడప కల్చరల్: కడప విజయదుర్గాదేవి ఆలయంలో భక్తులు మంగళవారం దోష నివారణ పూజలు నిర్వహించారు. తొలుత అమ్మవారి మూలమూర్తిని దర్శించుకుని, అనంతరం ఆలయ ప్రాంగణంలో సామూహిక రాహుకాల పూజల్లో పాల్గొన్నారు. భక్తులు ఈ సందర్భంగా అమ్మవారికి నిమ్మకాయ దీపాలను వెలిగించారు. సుధా మల్లికార్జునరావు, దుర్గాప్రసాద్ భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు.

అక్టోబరు 3 నుంచి శరన్నవరాత్రి ఉత్సవాలు

కడప కల్చరల్: కడప నగరం గడ్డిబజారులోని కామకోటి కళాంబదేవి, సోమసుందరేశ్వర స్వామి(బాలాజీ) ఆలయంలో అక్టోబరు 3వ తేదీ నుంచి శరన్నవరాత్రి ఉత్సవాలు నిర్వహిస్తున్నట్లు ఆలయ అర్చకులు చంద్రమౌళీశర్మ తెలిపారు. ఇందులో భాగంగా 3న దీక్షా బంధన అలంకారం, 4న శ్రీ రాజరాజేశ్వరీదేవి, 5న మీనాక్షి దేవి, 6న లక్ష్మీదేవి, 7న పార్వతీదేవి, 8న అన్నపూర్ణాదేవి, 9న సరస్వతీదేవి అలంకారం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. 10న ధాన్యలక్ష్మీదేవిగా, 11న వనదుర్గాదేవిగా(తోటోత్సవ), 12న శ్రీ విజయలక్ష్మీదేవిగా అలంకరిస్తారన్నారు. విజయదశమి రోజున శమీ దర్శనం ఊరేగింపు ఉంటుందన్నారు.

పంట పొలాల పరిశీలన

కడప అగ్రికల్చర్: రైతులు చీడ పీడలపై అప్రమత్తంగా ఉండాలని ఇన్‌ఛార్జి ఏడీ సురేష్‌కుమార్ రెడ్డి సూచించారు. పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా కడప మండల పరిధిలోని నానపల్లె, ఆలంఖాన్‌పల్లిలలో సాగుచేసిన పంటలను రైతులతో కలిసి మంగళవారం ఆయన పరిశీలించారు. గ్రామ సభల్లో ఆయన మాట్లాడుతూ ప్రతి రైతు పంట నమోదు చేసుకోవాలన్నారు. పురుగు మందులు, ఎరువుల వాడకంపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో మోహన్‌రాజ్, పావని, సిబ్బంది పాల్గొన్నారు.

అర్చక పురోహితులకు హెల్మెట్ల పంపిణీ



హెల్మెట్ అందజేస్తున్న విజయ్‌భట్టర్

కడప కల్చరల్: జిల్లా న్యాయ సేవాధికారి సంస్థ ఆధ్వర్యంలో అర్చక పురోహిత సమాఖ్య సంఘం సభ్యులకు ఆ సంఘం అర్చక పురోహిత సంఘం జిల్లా అధ్యక్షుడు విజయ్‌భట్టర్ మంగళవారం హెల్మెట్‌లు అందజేశారు. జిల్లా న్యాయాధికారి సంస్థ చేపట్టిన కార్యక్రమంలో భాగంగా తమ కార్యాలయంలో అర్చకులకు హెల్మెట్లు ఉచితంగా పంపిణీ చేశారు.

27న వేములలో జాబ్ మేళా

కడప కోటిరెడ్డిసర్కిల్ : జిల్లా ఉపాధి కార్యాలయం, నైపుణాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఈ నెల 27న వేముల ప్రభుత్వ ఐటీఐలో జాబ్ మేళా నిర్వహించనున్నట్లు జిల్లా ఉపాధి కల్పనాధికారి సురేష్ కుమార్ ఓ ప్రకటనలో తెలిపారు. టెన్త్, ఇంటర్, ఐటీఐ, డిగ్రీ, పీజీ చదివి 18 నుంచి 32 సంవత్సరాల మధ్య వయస్సు కలిగిన వారు అర్హులన్నారు. అభ్యర్థులు శుక్రవారం ఉదయం 10 గంటలకు సర్టిఫికెట్ల ధృవపత్రాలు, ఫోటోలు తీసుకుని రావాల్సి ఉంటుందన్నారు.

ఖాళీల భర్తీతో.. మెరుగైన వైద్యం

బహుళార్థ పశు వైద్యశాల(వెటర్నరీ పాలిక్లీనిక్)రోజూ 200 పశువులు, పెంపుడు జంతువులకు సేవలు అందిస్తోంది. అయితే సిబ్బంది కొరతతో సేవలకు కొంత ఆటంకం కలుగుతోంది. ఉచితంగా మందులు ఇస్తుండడంతో రోజూ ఆస్పత్రికి పశువుల సంఖ్య పెరుగుతోంది. అన్ని సౌకర్యాలు కల్పిస్తే మరింత మెరుగైన సేవలందిస్తామని అధికారులు చెబుతున్నారు.



గేదెకు వైద్య సేవలందిస్తున్న డాక్టర్ రంగస్వామి

రోజూ 150 పశువులకు వైద్యుల చికిత్స

కడప అగ్రికల్చర్: కడప నగరం కోటిరెడ్డి సర్కిల్‌లోని బహుళార్థ వైద్యశాల... రెఫరల్ వైద్యశాల కావడంతో కడప నగరం, ఇతర ప్రాంతాల నుంచి వైద్య సేవల కోసం ఆవులు, గేదెలు, మేకలతోపాటు పలు జంతువులను యజమానులు చికిత్స కోసం తీసుకువస్తున్నారు. ఉదయం నుంచి 9 గంటల నుంచి మధ్యాహ్నం ఒక గంట వరకు మళ్లీ రెండు గంటల నుంచి 4.30 గంటలకు వరకు నిరంతరం సేవలందుతుండడం, ఉచితంగా మందులు ఇవ్వడంతో చికిత్స కోసం వచ్చే పశువుల సంఖ్య పెరుగుతోంది.

సిబ్బంది కొరత

కడప బహుళార్థ పశు వైద్యశాల(వీపీసీ)లో ఒక డిప్యూటీ డైరెక్టర్‌తోపాటు ఏడుగురు సిబ్బంది ఉన్నారు. ఆరు పోస్టులు ఖాళీగా ఉన్నాయి. వెటర్నరీ అసిస్టెంట్, రెడియోగ్రాఫర్, నాలుగు అటెండర్ల పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ఇక్కడకు వచ్చే పశువుల సంఖ్య పెరగడంతో సిబ్బంది లేక సేవలకు ఆటంకం కలుగుతోంది. ఉన్నతాధికారులు స్పందించి ఖాళీలను భర్తీ చేస్తే నోరులేని మూగజీవాలకు మరింత మెరుగైన సేవలందిస్తామని డీడీ చెబుతున్నారు.

నెలవారీగా వైద్య సేవలందిన పశువుల సంఖ్య
జూన్: 4283
జులై: 4108
ఆగస్టు: 4072
సెప్టెంబర్(24వ తేదీ వరకు): 3772

ప్రతి నెలా 220 శస్త్ర చికిత్సలు

వైద్యశాలలో ప్రతినెలా పెంపుడు జంతువులకు 200 మైనర్, 20 మేజర్ శస్త్ర చికిత్సలు చేస్తున్నారు. ఇందులో ముఖ్యంగా కుక్కలకు, కుటుంబ నియంత్రణ శస్త్ర చికిత్సతోపాటు, పశువులకు కాళ్లు విరిగినా చికిత్స చేస్తున్నారు. వైద్య సామగ్రి కొనుగోలుకు ప్రభుత్వం రూ.20 లక్షల బడ్జెట్ కేటాయిస్తోంది.

నిత్యం పెద్ద సంఖ్యలు పశువులు, మేకలను యజమానులు తీసుకువస్తున్నారు. వచ్చిన వాటన్నింటికీ వైద్య సేవలందించి కావాల్సిన మందులు అందిస్తున్నాం. మూగ జీవాలకు వైద్య సేవలందిస్తుంటే ఎంతో తృప్తిగా ఉంటుంది. ఖాళీలను భర్తీ చేస్తే మరింత మెరుగైన సేవలందుతాయి. – **డాక్టర్. రంగస్వామి, డిప్యూటీ డైరెక్టర్, బహుళార్థ పశు వైద్యశాల కడప.**

సమస్యలపై ఎంపీకి వినతి



ఎంపీ అవినాష్‌రెడ్డికి సమస్యలు విన్నవిస్తున్న పార్టీ నాయకులు

కడప కార్పొరేషన్: కడప పార్లమెంటు సభ్యులు వైఎస్ అవినాష్‌రెడ్డిని వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు మంగళవారం కలిశారు. కడపలోని తన నివాసానికి వచ్చిన ఎంపీని పలువురు నాయకులు, కార్యకర్తలు, ప్రజలు కలిసి తమ సమస్యలపై వినతి పత్రం సమర్పించారు. వాటికి సానుకూలంగా స్పందించిన ఎంపీ అధికారులతో మాట్లాడి పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మైదుకూరు మాజీ ఎమ్మెల్యే రఘురామిరెడ్డి, వైఎస్సార్‌సీపీ నేత రెడ్యం వెంకట సుబ్బారెడ్డి, పాల్గొన్నారు.

వీఆర్ఏల ఆందోళన



ఆందోళన చేస్తున్న వీఆర్ఏలు

కడప సెవెన్‌రోడ్స్: జిల్లా వ్యాప్తంగా తహసీల్దారు కార్యాలయాల్లో ఖాళీగా ఉన్న అటెండర్, వాచ్‌మెన్, రికార్డు అసిస్టెంట్, డ్రైవర్, కంప్యూటర్ ఆపరేటర్ పోస్టులను అర్హులైన వీఆర్ఏలతో భర్తీ చేయాలని ఏపీ వీఆర్ఏల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గొర్లె ధైర్యం, వీఆర్ఏ సంక్షేమ సేవా సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కొమ్మద్ది ఈశ్వరయ్య, జిల్లా అధ్యక్షుడు కోడూరు పుల్లయ్య కోరారు. జాయింట్ కలెక్టర్ అదితి సింగ్‌ను ఆయన మంగళవారం కలిసి తమ సమస్యలపై వినతిపత్రాన్ని సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అటెండర్లు, వాచ్‌మెన్లు లేకపోవడంతో వీఆర్ఏలతో పగలు, రాత్రి డ్యూటీలు చేయిస్తున్నారని, గౌరవ వేతనం రూ. 11 వేలు మాత్రమే ఇస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో శ్రీనివాసులు, పురుషోత్తం, లక్ష్మినారాయణ, వెంకటేశ్, ఓబయ్య, తదితరులు పాల్గొన్నారు.

ఆశా కార్యకర్తల నిరసన



నిరసన తెలుపుతున్న ఆశా కార్యకర్తలు

కడప వైఎస్ఆర్ సర్కిల్: జిల్లా వ్యాప్తంగా ఆశా కార్యకర్తల సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఏపీ ఆశా వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షురాలు పి.సుభాషిణి, ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు గుంటి వేణుగోపాల్ డిమాండ్ చేశారు. ఆశా కార్యకర్తల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ డీఎంఅండ్‌హెచ్‌వో కార్యాలయం ఎదుట మంగళవారం నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జిల్లాలో తమకు సంబంధం లేని రక్త, టీబీ, పరీక్షలు, ఎన్సీడీసీడీ సర్వే పనులు చేయాలంటూ నాయకులు, అధికారులు ఆశాలను వేధింపులకు గురిచేస్తున్నారన్నారన్నారు. జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ నాగరాజుకు గతంలో ఫిర్యాదు చేసినా స్పందన లేదన్నారు. ఆశా కార్యకర్తలకు రూ.26 వేల వేతనం ఇవ్వాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని, సాధారణ, మెటర్నిటీ సెలవులు ఇవ్వాలని డిమాండ్ చేశారు.

ఏపీఐఐసీ కార్యాలయం అధ్వానం





కడప నగరంలోని ఏపీఐఐసీ కార్యాలయం చిన్నపాటి వర్షానికి అధ్వానంగా కనిపిస్తోంది. ఓ మోస్తరు వర్షం కురిసినా స్లాబు నుంచి నీరు కారుతూ పెచ్చులూడుతోంది. కార్యాలయంలో మెట్లపైకి నీరు చేరడంతో ఉద్యోగులు, సిబ్బంది జారి పడుతున్నారు. కార్యాలయం వెనుక నీరు నిలిచి.. పిచ్చిమొక్కలు పెరగడంతో అపరిశుభ్ర వాతావరణం నెలకొంది. కార్యాలయంలో రెగ్యులర్ జోనల్, డిప్యూటీ జోనల్ మేనేజర్లు లేకపోవడంతో ఇన్‌ఛార్జులే కొనసాగుతున్నారు. ఫలితంగా కార్యాలయ పనులు నత్తనడకన సాగుతున్నాయి. **- కడప కార్పొరేషన్**

నగరంలో కొనసాగుతున్న స్పెషల్ డ్రైవ్



ప్రజలకు సూచనలు చేస్తున్న కడప ఇన్‌ఛార్జి డీఎస్పీ ఎస్.రమాకాంత్

కడప అర్బన్: వైఎస్ఆర్ జిల్లా ఎస్పీ వి. హర్షవర్ధన్ రాజు ఆదేశాల మేరకు కడప నగరం, శివారులో ఇన్‌ఛార్జి డీఎస్పీ ఎస్.రమాకాంత్ మంగళవారం రాత్రి స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. బ్లూకోల్ట్స్, స్పెషల్ పార్టీ సిబ్బంది 50 మంది ముమ్మరంగా వాహనాల తనిఖీలు, నైట్ పెట్రోలింగ్ నిర్వహించారు. స్పెషల్ డ్రైవ్‌లో కమాండ్ కంట్రోల్ ఇన్స్‌పెక్టర్ ఎం.వెంకటేశ్వర్లు, కడప వన్‌టౌన్ సీఐ బి.రామకృష్ణ, టూటౌన్ సీఐ బి.నాగార్జున, తాలూకా సీఐ వెంకటేశ్వర్లు, ఎస్ఐలు, సిబ్బంది పాల్గొన్నారు. బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవిస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు.

మతి స్థిమితంలేని యువతి హల్‌చల్

కడప అర్బన్: నగరంలోని పలు కూడళ్ల వద్ద మతిస్థిమితం లేని ఓ యువతి(20) దుస్తులను చింపుకుని హల్‌చల్ చేసింది. జయరాజా గార్డెన్స్ సమీపంలో తన కుటుంబ సభ్యులతో కలిసి వుంటున్న యువతి మానసిక రోగంతోతో బాధ పడుతోంది. కుటుంబ సభ్యులకు తెలియకుండా నగరంలోని విచ్చేసిన యువతి ఐటీఐ సర్కిల్, బిల్టప్ మీదుగా చెన్నూరు బస్టాండ్ వద్దకు చేరుకుంది. నేరుగా అప్సరా సర్కిల్ వద్దకు చేరుకుని తన శరీరంపై దుస్తులను చించేసుకుంది. పోలీసులకు సమాచారం రావడంతో ఆమెను ఓ దుకాణంలోకి తీసుకువెళ్లారు. అక్కడ నైటీ వేసి ఆమె కుటుంబసభ్యులకు అప్పగించారు. తరువాత కడప రిమ్స్ ఆవరణంలోని మానసిక వైద్యశాలలో చికిత్స కోసం చేర్పించారు.

కమిషనర్ మార్నింగ్ విజిట్



సూచనలిస్తున్న కమిషనర్ వైఓ నందన్

కడప కార్పొరేషన్: కడప నగరంలో వర్షాలు కురిసినపుడు నీరు నిలవకుండా జాగ్రత్తలు తీసుకోవాలని నగర పాలక కమిషనర్ వై.ఓ.నందన్ ఆదేశించారు. మార్నింగ్ విజిట్‌లో భాగంగా బిల్టప్ సర్కిల్, ఎస్‌బీఐ కాలనీ, బచ్చుంపల్లి ప్రాంతాలను మంగళవారం ఆయన పరిశీలించారు. కమిషనర్ మాట్లాడుతూ ఎస్‌బీఐ కాలనీ నుంచి మూత పడిన కాలువను తక్షణం ఉపయోగంలోకి వచ్చేలా చర్యలు తీసుకోవాలన్నారు. నీరు నిల్వ ఉంటే వ్యాక్యూమ్ వెహికల్, గల్పర్ ద్వారా తొలగించే చర్యలు చేపట్టాలన్నారు. జేసీబీతో కాల్వలు ఏర్పాటుచేసి మురుగు కాల్వల్లోకి పంపే ఏర్పాట్లు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఇంజినీరింగ్, శానిటేషన్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

సేవాగుణం అలవర్చుకోవాలి

వైవీయూ: విద్యతో పాటు సేవాగుణం అలవర్చుకోవాలని ఎస్కేఆర్ అండ్ ఎస్కేఆర్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డా. వి.సలీంబాషా సూచించారు. జాతీయ సేవా పథకం దినోత్సవం సందర్భంగా కళాశాలలో వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ మాట్లాడుతూ విద్యార్థి దశ నుంచే విద్యార్థుల్లో సమాజం పట్ల బాధ్యత పెంచేందుకు ఎన్ఎస్ఎస్ ఏర్పాటైందన్నారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ పీఓలు, విద్యార్థులు పాల్గొన్నారు.

పొగాకు నివారణపై అవగాహన



సదస్సును వీక్షిస్తున్న ప్రిన్సిపల్ డాక్టర్ ఎ. సురేఖ, వైద్యాధికారులు

కడప అర్బన్: పొగాకు నివారణపై ఆన్‌లైన్ అవగాహన సదస్సును ఢిల్లీ నుంచి కేంద్ర మంత్రి జె.పి.నడ్డా ఆన్‌లైన్ ద్వారా మంగళవారం ప్రారంభించారు. ఇందులో పొగాకు తీసుకుంటే కలిగే శారీరక, మానసిక సమస్యలపై అవగాహన కల్పించారు. కడప మానసిక వైద్యశాలలో వున్న కాన్ఫరెన్స్ హాల్ నుంచి పలువురు వీక్షించారు. ఈ కార్యక్రమంలో కడప ప్రభుత్వ వైద్య కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎ.సురేఖ, వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ శారదాదేవి, ఐఎంహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ ఆర్.వెంకటరాముడు, ఐఎంహెచ్ డాక్టర్స్, పాల్గొన్నారు.

జిల్లా అండర్-14, అండర్-17 జట్లు ఎంపిక

కడప స్పోర్ట్స్: కడప నగరంలోని వైఎస్ఆర్ ఇండోర్ స్టేడియంలో మంగళవారం నిర్వహించిన జిల్లాస్థాయి రెజ్లింగ్ ఎంపికలకు క్రీడాకారుల నుంచి విశేష స్పందన లభించింది. జిల్లా నలుమూలల నుంచి పెద్దసంఖ్యలో క్రీడాకారులు హాజరై ఎంపికల్లో పాల్గొనగా.. ఎంపిక ప్రక్రియ రాత్రి వరకు కొనసాగింది. ఈ సందర్భంగా ఎస్జీఎఫ్ జిల్లా కార్యదర్శి బి. అరుణకుమారి మాట్లాడుతూ రెజ్లింగ్ క్రీడకు క్రీడాకారుల నుంచి చక్కటి స్పందన రావడం సంతోషంగా ఉందన్నారు. అనంతరం వివిధ వెయిట్ కేటగిరీల్లో ఎంపికలు నిర్వహించి జిల్లా అండర్–14, అండర్–17 జట్లను ప్రకటించారు. కార్యక్రమంలో ఫిజికల్ డైరెక్టర్లు సాజిత్, వెంకటలక్ష్మి, ప్రవీణ్‌కిరణ్, కోచ్‌లు, క్రీడాకారులు పాల్గొన్నారు.

జిల్లా జట్టుకు ఎంపికైన క్రీడాకారులు..

అండర్–14 బాలికలు : సుచిత్రారెడ్డి, గోపిక, ప్రణవి, అనీషా, కీర్తన, తనూజ, చంద్రమౌనిక, సింధు, ధరణి, ప్రార్థన.

అండర్–17: అక్షిత, శ్యామల, అమృత, మాధవి, హేమప్రియ, చందనప్రియ, వెంకటలక్ష్మి, ఆయేషా, హిమశైలజ, ఆర్షియ.

అండర్–14 బాలురు: కిరణ్, పవన్, జయంత్‌కుమార్, రవితేజ, ఇస్మాయిల్, నవీన్‌కుమార్, రిషి, కల్యాణ్, హసన్, పవన్‌కల్యాణ్

పరీక్షలు చేయించుకుందాం .. క్యాన్సర్‌ను జయిద్దాం



క్యాన్సర్ చికిత్స కోసం మణిపాల్ ఆస్పత్రి బ్లూ బస్ వద్దకు వచ్చిన మహిళలు

కడప అర్బన్: పోలీసు శాఖలోని మహిళా సిబ్బంది, వారి కుటుంబీకులకు నిర్వహించే క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు చేయించుకుని.. సరైన చికిత్సతో వ్యాధిని జయించాలని అదనపు ఎస్పీ (అడ్మిన్) కె. ప్రకాష్ బాబు సూచించారు. పోలీసుల సంక్షేమంలో భాగంగా ఎస్పీ వి.హర్షవర్ధన్ రాజు చొరవతో విజయవాడ మణిపాల్ ఆసుపత్రి సిబ్బంది మంగళవారం ఉచితంగా బ్రెస్ట్, గర్భాశయ క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు ఎస్పీ(అడ్మిన్) మాట్లాడుతూ మహిళలు తమ ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని, అనారోగ్య లక్షణాలు గుర్తిస్తే వెంటనే వైద్య పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. సకాలంలో వైద్య పరీక్షలు చేయించుకుంటూ తగిన చికిత్స తీసుకుని వ్యాధిని నయం చేసుకోవచ్చన్నారు. లక్షణాలను గుర్తించిన తరువాత అవసరమైన పరీక్షలు చేయడం ద్వారా వ్యాధిని జయించవచ్చునని పేర్కొన్నారు. అదనపు ఎస్పీ (ఎ.ఆర్) ఎస్ఎస్‌వీ.కృష్ణారావు మాట్లాడుతూ మహిళా సిబ్బంది, హోంగార్డులు, డీపీఓ సిబ్బంది, వారి కుటుంబాల్లోని మహిళలకు ఈ నెల 24, 25, 26వ తేదీలలో క్యాన్సర్ నిర్ధారణ పరీక్షలు నిర్వహిస్తారని పేర్కొన్నారు. మణిపాల్ అస్పత్రి రేడియేషనల్ ఆంకాలజిస్ట్ స్పెషలిస్ట్ వైద్యులు డాక్టర్. శ్రీదివ్య మాట్లాడుతూ కొన్ని క్యాన్సర్లు వంశపారంపర్యంగా వచ్చే అవకాశం వుందన్నారు. ఈ కార్యక్రమంలో ఇన్‌ఛార్జ్ డీఎస్పీ ఎస్.రమాకాంత్, ఏఆర్ డీఎస్పీ మురళీధర్, వైద్యురాలు డాక్టర్ మేరీ సుజాత, ఆర్ఐలు ఆనంద్, టైటస్, శ్రీశైలరెడ్డి, వీరేష్, ఎస్ఐలు పావని, నస్రీన్, పోలీస్ అధికారుల సంఘం జిల్లా అధ్యక్షుడు దూలం సురేష్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఉప్పుశంకర్, మణిపాల్ ఆసుపత్రి సిబ్బంది వినోద్ కుమార్, లక్ష్మీదేవి, మాధవీలత పాల్గొన్నారు.

నిరాశ్రయుల వసతి గృహంలో అన్నదానం



అన్నదానం చేస్తున్న ఫౌండేషన్ సభ్యులు

కడప అర్బన్: హిమవర్షిణి ఫౌండేషన్ ఆధ్వర్యంలో కడప నగరంలోని ప్రేమాలయ నిరాశ్రయుల నివాస వసతి గృహంలో నిరాశ్రయులకు మంగళవారం అన్నదానం చేశారు. కువైట్‌లో వుంటున్న ఉద్దండం శ్రీను, సతీమణి లక్ష్మి కుమారుడు ఉద్దండం దీపక్ జన్మదినం సందర్భంగా జరిగిన ఈ కార్యక్రమంలో హిమవర్షిణి ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షురాలు గుండ్లకొండ విజయలక్ష్మి మాట్లాడుతూ వృద్ధులకు దాతల సహకారంతో గత 14 నెలలుగా అన్నప్రసాద వితరణ కార్యక్రమం చేపడుతున్నామన్నారు. ఈ కార్యక్రమంలో గుండ్లకొండ రవి, రమేష్‌బాబు, పుట్టా పురుషోత్తం, రెడ్డి లక్ష్మణ్, దామోదర్, రాజశేఖర్‌రెడ్డి, టైలర్ రవి, రాఘవేంద్ర, మధు, అరుణకుమారి, మునిజ, శ్రీనివాసులరెడ్డి పాల్గొన్నారు.

మహ్మద్ ప్రవక్త మార్గాన్ని అనుసరించాలి

- మేయర్ సురేష్ బాబు, మాజీ డిప్యూటీ సీఎం అంజద్ బాషా



బార్మీ కార్యక్రమంలో మేయర్ సురేష్ బాబు, మాజీ డిప్యూటీ సీఎం అంజద్‌బాషా

కడప కార్పొరేషన్: మహ్మద్ ప్రవక్త మార్గాన్ని ప్రతి ఒక్కరూ అనుసరించాలని మేయర్ సురేష్ బాబు, మాజీ డిప్యూటీ సీఎం అంజద్ బాషా అన్నారు. స్థానిక ఎన్టీఆర్ సర్కిల్, రవిగ్రూప్ థియేటర్ ఆవరణంలో వైఎస్సార్‌సీపీ యువజన విభాగం నగర అధ్యక్షుడు దేవిరెడ్డి ఆదిత్య ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన బార్మీ ఫాతేహా కార్యక్రమంలో మంగళవారం వారు పాల్గొని ప్రార్థనలు నిర్వహించారు. అనంతరం అన్నదానంంంం కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మహ్మద్ ప్రవక్త జన్మదిన మాసోత్సవ సందర్భంగా అన్నదాన కార్యక్రమాలు నిర్వహించడం మరింత పుణ్యకార్యమన్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు బీహెచ్ ఇలియాస్, జయచంద్రారెడ్డి, పాకా సురేష్, ఐస్‌క్రీం రవి, షఫీ, రామలక్ష్మణ్ రెడ్డి, మల్లికార్జున, సుభాన్‌బాషా, ఉమైర్, రామ్మోహన్‌రెడ్డి, బాబు పాల్గొన్నారు.

నదుల శుభ్రత.. అందరి బాధ్యత

- ప్రపంచ నదుల దినోత్సవంలో ప్రిన్సిపల్ డా.సలీం బాషా



ప్రపంచ నదుల దినోత్సవ వేడుకల్లో ప్రిన్సిపల్, అధ్యాపకులు, విద్యార్థినులు

వైవీయూ: నదులను పరిశుభ్రంగా ఉంచుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని కడప ఎస్కేఆర్ అండ్ ఎస్కేఆర్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డా.వేమల సలీంబాషా అన్నారు. కళాశాల ఎన్‌సీసీ యూనిట్ ఆధ్వర్యంలో ప్రపంచ నదుల దినోత్సవం సందర్భంగా విద్యార్థులకు పోటీలు నిర్వహించి బహుమతుల ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ మాట్లాడుతూ చెత్త, ప్లాస్టిక్ వ్యర్థాలను నీటిలో వేయకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఎన్‌సీసీ అధికారి డాక్టర్ బి.స్వరూప మాట్లాడుతూ నదులు కలుషితం కాకుండా చూడాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. కార్యక్రమంలో గురుమోహన్‌రెడ్డి, విజయలక్ష్మి, శ్రీనివాసులురెడ్డి, సుబ్బారెడ్డి పాల్గొన్నారు.

ఫాతిమాలో పొగాకు నియంత్రణ కేంద్రం



కేంద్రాన్ని ప్రారంభిస్తున్న కళాశాల ఈడీ సల్మాన్

కడప కోటిరెడ్డిసర్కిల్ : కడప నగర శివాయలోని ఫాతిమా వైద్య కళాశాలలో ఏర్పాటుచేసిన పొగాకు ఉత్పత్తుల వాడకం, నియంత్రణ కేంద్రాన్ని కళాశాల ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సల్మాన్ మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పొగాకు, ఇతర ఉత్పత్తుల వాడకంతో కలిగే వ్యాధులు, నష్టాలపై ప్రజలకు అవగాహన కల్పించి, వారి అలవాట్లను మాన్పించేందుకు ఈ కేంద్రంలో కౌన్సెలింగ్ ఇస్తారన్నారు. ప్రజలు కేంద్రాన్ని ఉపయోగించుకోవాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో నోడల్ ఆఫీసర్ డాక్టర్ చంద్ర శేఖర్, ప్రిన్సిపల్ డాక్టర్ శైలారేఖ, డాక్టర్ రామమనోహర్ రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

విశ్వజ్ఞాన సముపార్జన లక్ష్యం కావాలి

- జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి బాబా ఫక్రుద్దీన్



స్వామి వివేకానందుని చిత్రపటానికి పూలమాల వేసి కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న అతిథులు

వైవీయూ: విశ్వవిద్యాలయంలో విద్యనభ్యసించే విద్యార్థులు ప్రపంచ జ్ఞానాన్ని ప్రోది చేసుకొని ఉజ్వల భవిష్యత్తును నిర్మించుకోవాలని జిల్లా లీగల్ సర్వీస్ అథారిటీ సెక్రటరీ, సీనియర్ సివిల్ జడ్జి బాబా ఫక్రుద్దీన్ అన్నారు. మాదకద్రవ్యాలు– నిర్మూలనపక్షోత్సవాల ముగింపు సమావేశం యోగివేమన విశ్వవిద్యాలయంలో ఎన్ఎస్ఎస్, ఎన్‌జీఓ, నెహ్రూ యువకేంద్రం సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన సీనియర్ సివిల్ జడ్జి ప్రసంగిస్తూ మత్తును కలిగించే పదార్థాల జోలికి వెళ్లకూడదని ఎన్‌డీపీఎస్ యాక్ట్ గురించి వివరించారు. గంజాయి వంటి మత్తు పదార్థాలు దగ్గర ఉన్నా మూడు సంవత్సరాలు జైలు, లక్ష రూపాయలు జరిమానా ఉంటుందని గుర్తుచేశారు. డ్రగ్ నిర్మూలనలో యువత పాత్ర పోషించాలని ఆకాంక్షించారు. విశ్వవిద్యాలయ వైస్ చాన్సలర్ ఆచార్య కె. కృష్ణారెడ్డి మాట్లాడుతూ మత్తు అలవాటు ఉన్నవారిని సమాజం చీదరించుకుంటుందని, అలానే శరీరంలో ఉండే అవయవాలు దెబ్బతింటాయన్నారు. ప్రిన్సిపల్ ఆచార్య ఎస్. రఘునాథరెడ్డి కార్యక్రమానికి అధ్యక్షత వహించి మాట్లాడుతూ మత్తు పదార్థాల వల్ల నమోదైన కేసులు, అరెస్ట్ అయిన వారి వివరాలు గణాంకాలతో వివరించారు. నెహ్రూ యువ కేంద్రం అధికారి మణికంఠ మాట్లాడుతూ సరదాల కోసం జీవితాన్ని నాశనం చేసుకోవద్దని సూచించారు. రమ మైండ్ క్లినిక్ వ్యవస్థాపకులు డాక్టర్ వెంకట్రామ్, యూనియన్ బ్యాంక్ రీజినల్ హెడ్ లక్ష్మీ తులసి మాట్లాడారు. వైవీయూ ఎన్ఎస్ఎస్ సమన్వయకర్త డాక్టర్ ఎస్. వెంకట్రామిరెడ్డి కార్యక్రమాన్ని సమన్వయం చేశారు. ఈ కార్యక్రమంలో స్వచ్ఛంద సేవ ప్రతినిధులు అశోక్, విజయ్ కుమార్, లక్ష్మీదేవి, వసంత్, శివశంకర్, వేణుగోపాల్, ప్రేమ్ కుమార్ పాల్గొన్నారు.

కడపను అభివృద్ధి చేస్తాం

కడప కార్పొరేషన్: కడపను అన్ని విధాలా అభివృద్ధి చేస్తామని ఎమ్మెల్యే మాధవీరెడ్డి అన్నారు. కమిషనర్ చాంబర్‌లో సమావేశం అనంతరం విలేకరులతో ఎమ్మెల్యే మాట్లాడుతూ టిడ్కో ఇళ్లు, జగనన్న కాలనీల్లో ప్రభుత్వం ఇచ్చిన పక్కా గృహాల ప్రోగ్రెస్‌పై సమీక్ష చేశామన్నారు. రాష్ట్ర ప్రభుత్వం 'మన ఇల్లు–మన గౌరవం' కార్యక్రమం ద్వారా ప్రతి లబ్ధిదారుడికీ ఇళ్లు కట్టించాలని నిర్ణయించిందన్నారు. నిన్న కురిసిన వర్షానికి కడపలో రహదారులు, కొన్ని ప్రాంతాలు జలమయమయ్యాయని, ఆ నీటిని తొలగించి, ప్రజలకు సౌకర్యవంతంగా తయారు చేయాలని సూచించామన్నారు. నెలకో సమావేశం ఏర్పాటుచేస్తామని, సీఎం చంద్రబాబును అభివృద్ధి జరిగేలా కృషి చేస్తామని తెలిపారు.